సాక్షి
నారాయణపేట
బుధవారం ; 26 ; జూన్ ; 2024



ఎట్టకేలకు పరిహారం
నష్టపరిహారం డబ్బులను భూ నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నారు.
వివరాలు 8లో ▸



పెట్టుబడుల కాలం
వ్యవసాయం, పాఠశాలల ప్రారంభంతో పేదలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
31.2 /23.4

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రివేళలో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విధుల్లో చేరిన స్కూల్ అసిస్టెంట్లు



నారాయణపేట రూరల్: జిల్లాలో బదిలీలైన స్కూల్ అసిస్టెంట్ టీచర్లు వారికి అలాట్ చేసిన పాఠశాలల్లో మంగళవారం చేరారు. ఆదివారం వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇవ్వగా.. సోమవారం సాయంత్రం వారు కోరుకున్న స్థానాలను కేటాయిస్తూ.. ఉత్తర్వులు జారీ చేసి సెల్‌కు మెసేజ్ పంపించారు. మంగళవారం ఉదయం వారి పాత స్థానంలో రిలీవ్ అయ్యి కొత్త పాఠశాలల్లో జీహెచ్‌ఎంలకు జాయినింగ్ లెటర్లు అందించి విధుల్లో చేరారు. పీఎస్ హెచ్‌ఎంలుగా 22, ఎస్‌ఏ గణితం 54, ఎస్‌ఏ ఫిజిక్స్ 48, ఎస్‌ఏ బయోసైన్స్ 27, ఎస్‌ఏ ఇంగ్లీష్ 34, ఎస్‌ఏ హిందీ 13, ఎస్‌ఏ తెలుగు 19, ఎస్‌ఏ ఉర్దూ 1, ఎస్‌ఏ సోషల్ 50, పీడీ 3లతో కలిపి మొత్తం 271 మంది బదిలీ అయ్యారు. ఇక ఎస్జీటీలకు సంబంధించి పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుంది. సీనియార్టీ లిస్ట్ నోటీస్‌బోర్డుపై వేయగా.. సవరణలకు ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. బుధవారం ఆప్షన్లు ఇచ్చేందుకు అవకాశం ఉంది. వీరు ఎల్‌ఎఫ్‌ఎల్‌తో పాటు ఎస్‌ఏలుగా పదోన్నతి పొందనున్నారు. చివరిగా ఎస్జీటీల బదిలీలు జరగనున్నాయి.

కోర్టు సూచన మేరకు పరీక్ష ఫీజు తగ్గించాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో 2010 నుంచి 2016 మధ్యలో వివిధ గ్రూప్‌లు చదివి ఫెయిల్ అయిన విద్యార్థులు మరోసారి పరీక్ష రాసేందుకు చివరి అవకాశాన్ని పీయూ అధికారులు కల్పించారు. ఇందుకు సంబంధించి పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాజ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ప్రతి గ్రూప్ వారు ఒక సబ్జెక్టుకు రూ.5 వేలు చెల్లించాలని పేర్కొన్నారు. అయితే 4, 5 సబ్జెక్టులు ఉన్నవారికి సుమారు రూ.20- 25 వేల భారం పడుతుంది. దీంతో పలు సంఘాలు విద్యార్థులు ఫీజులు తగ్గించాలని పీయూ అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. విచారించిన కోర్టు గతంలో ఉస్మానియా యూనివర్సిటీకి సంబంధించి అధిక ఫీజులపై 2023లో ఇచ్చిన ఆదేశాలను అనుసరించి ఫీజులు ఉండాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఆర్డర్ కాపీని విద్యార్థి సంఘం నాయకుడు శ్రీధర్ పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డికి అందించారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఫీజులు వసూలు చేయాలని, ఇప్పటి వరకు చెల్లించిన ఫీజులు విద్యార్థులకు తిరిగి ఇవ్వాలని కోరారు. దీంతో రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి స్పందిస్తూ కోర్టు ఆర్డర్ కాపీ అధికారికంగా ఇంకా అందలేదని, లాయర్ ద్వారా సమాచారం తెలుసుకుని ఫీజులు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఫీజులో 80 శాతం వరకు తగ్గనున్నట్లు సమాచారం.

ఎదురుచూపులు..!

పెట్టుబడి సాయంపై కౌలు రైతుల ఆశలు



మరికల్ శివారులో పత్తిపంటలో కలుపు నివారణ కోసం గున్నక తోస్తున్న కౌలు రైతు

- జిల్లాలో 5వేలకు పైగా కౌలు రైతులు
- వీరి సర్వేపై స్పష్టత లేని వైనం

మరికల్: రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం ఇస్తామని ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఇన్నాళ్లు వడ్డీలకు అప్పులు తెచ్చి పంటలు పండిస్తున్న కౌలు రైతులు ఎన్నాడు కూడా లాభాలను కళ్ల చూసింది లేదు. జిల్లాలో రైతుల వద్ద భూములను కౌలుకు తీసుకుని సాగు చేసే వాళ్ల సంఖ్య చాలా ఎక్కువగానే ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పడంతో ఆ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. 2016లో అప్పటి ప్రభుత్వం జిల్లాలో ఓ సర్వే నిర్వహించి 2800 మంది కౌలు రైతులు ఉన్నట్లు గుర్తించింది. తర్వాత ప్రభుత్వం తీసుకొచ్చిన పెట్టుబడి సాయంలో వీళ్లకు అవకాశం కల్పించకపోవడంతో పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 5 వేలకు పైగా కౌలు రైతులు ఉంటారని వ్యవసాయ అధికారుల అంచనకు వచ్చారు.



సాగు చేసిన పంటను చూపిస్తున్న కౌలు రైతు

చిన్న, సన్నకారు రైతులు సైతం

జిల్లాలో చిన్న, సన్నకారు రైతులు 42,480 మంది ఉన్నారు. వీరికి ఎకరా నుంచి ఐదు ఎకరాలలోపు వ్యవసాయ భూములు ఉన్నాయి. రైతులు తమకున్న కొద్దిపాటి భూమితో పాటు పక్కనున్న ఇతరుల పొలాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తుంటారు. ఫలితంగా వీళ్లు కూడా సాగుకు అప్పులు చేయాల్సి వస్తోంది. కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద ఎకరాకు రూ.15 వేల వరకు చెల్లిస్తున్నారు. పంట చేతికొచ్చినా, రాకపోయినా కౌలును మాత్రం చెల్లించాల్సిస్తోంది. సాగుకు కావాల్సిన, విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు పెరిగిపోతున్నాయని చిన్న, సన్నకారు రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతు భరోసాలో భాగంగా కౌలు డబ్బులు చెల్లిస్తే తమకు ఎంతో ఆసరాగా ఉంటుందని అంటున్నారు.

కౌలు రైతుల వివరాలపై స్పష్టత కరువు

ఇప్పటికే జిల్లాలో వానాకాలం సాగు షురూ అయ్యింది. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద పట్టాదారులకు సంబంధించిన వివరాలే ఉన్నాయి. కౌలు రైతుల వివరాలు లేవు. అసలు వీరిని ఎలా గుర్తించాలనే దానిపై స్పష్టత లేదు. జిల్లాలో 50వేలకు పైగా కౌలు, చిన్న, సన్నకారు రైతులు ఉన్నారు. వీరు రైతుభరోసా కింద పెట్టుబడి సాయం వస్తుందని ఆశిస్తున్నారు. జిల్లాలో ఏటా 1.71 లక్షల మందికి రైతులకు పెట్టుబడి సాయం అందుతోంది. కౌలు రైతులకు కూడా ఈ సాయం అందితే సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

12 ఎకరాలు కౌలుకు తీసుకున్నా



మూడేళ్ల నుంచి 12 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. 8 ఎకరాల్లో వరి, 2 ఎకరాల్లో మిరప, 2 ఎకరాల్లో వేరుశనగ పంటలను సాగు చేస్తున్నా. ప్రతి ఏడాది రూ.5 లక్షల పెట్టుబడి అవుతోంది. ప్రభుత్వం కౌలు రైతులను అదుకుంటామని చెబుతోంది. మాకు కూడా రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తే కొంత మేర పెట్టుబడి రూపంలో ఆర్థిక భారం తగ్గుతోంది.

– శ్రీనివాసు, కౌలు రైతు, కన్మనూర్

పెట్టుబడి సాయం ఇవ్వాలి



మాలాంటి కౌలు రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తే అప్పులు కాస్త తగ్గించుకున్నే అవకాశం ఉంది. పట్టాదారులకు అందజేసే సమయంలోనే కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం అందిస్తే వ్యవసాయ ఖర్చులకు ఉపయోగించుకుంటాం. – ఆంజనేయులు, రైతు, మరికల్

ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు

కౌలు రైతులకు ప్రభుత్వం రైతు భరోసా ఇస్తామని ప్రకటించినా వారిని గుర్తించేందుకు ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రాలేదు. ఒక వేళ ప్రభుత్వం నుంచి శేమైన ఆదేశాలు వస్తే కౌలు రైతుల వివరాలను సేకరించి నివేదిక అందజేస్తాం.

– జాన్‌సుధాకార్, జిల్లా వ్యవసాయ అధికారి

పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి



మద్దూరు బాలుర పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కలెక్టర్ సిక్తా పట్నాయక్

మద్దూరు: సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు మిగితా అన్ని జిల్లాల పాఠశాలలకు ఆదర్శంగా ఉండాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఖాజీపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ, క్రీడా ప్రాంగణం, మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఖాజీపూర్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన మౌలిక వసతి కల్పన పనులు పర్యవేక్షించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల కొరత విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. బదిలీల్లో ఈ సమస్య తీరుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటించారు. శిథిలావస్థలోని అంగన్‌వాడీని చూసి కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ వస్తున్నారని తెలిసి కూడా గ్రామంలో పారిశుద్ధ్య పనులు మెరుగు పరచకపోవడంపై ఎంపీఓ విజయలక్ష్మిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దూరు బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఇక్కడ 800 మంది విద్యార్థులు చదువుతున్న విషయాన్ని కలెక్టర్‌కి తెలియజేశారు. విద్యార్థులకు తగిన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. డిజిటల్ తరగతులను పర్యవేక్షించి ఈ పాఠశాలకు కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తామన్నారు. సబ్జెక్టుల వారీగా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి తనకు నివేదిక ఇస్తే, పదో తరగతి పరీక్ష ఫలితాల మెరుగుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలని సూచనలు చేస్తానన్నారు.

వైద్య సేవలు మెరుగు పరుస్తాం..

మద్దూరులోని సీహెచ్‌సీ, పీహెచ్‌సీ ఆస్పత్రి సేవలను మెరుగు పర్చడానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. నెలలో ఎన్ని కాన్పులు జరుగుతాయని అక్కడున్న నర్సును అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఆస్పత్రిలో రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో మద్దూరు, కొత్తపల్లి తహసీల్దార్లు మహేష్‌గౌడ్, అనిల్‌కుమార్, ఎంఈఓ గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట: జిల్లాలోని పోలీసు అధికారులు నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన నెలవారి నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ముందుగా పోలీస్ స్టేషన్లలోని గ్రేవ్, నాన్ గ్రేవ్ పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకుని పెండింగ్ కేసులను త్వరితగతిన న్యాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పెండింగ్ కేసులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎస్పీ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుదారుల ఫిర్యాదులు, పోలీస్‌స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచరాదన్నారు. వాటిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బాధితులకు న్యాయం అందేలా చూసి వారికి భరోసా కల్పించాలని తెలియజేశారు. పోక్సో, ఎస్సీ ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, పూర్తి పారదర్శకంగా కేసులను ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. పెండింగ్‌లోని సిసి నెంబర్లను త్వరగా తీసుకోవాలని సూచించారు. అలాగే వర్షాకాలం సందర్భంగా భూములకు సంబంధించిన పంచాయతీలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. సివిల్ కేసులు కోర్టులో పరిష్కరించుకోవాలని బాధితులకు సూచించాలన్నారు.

సమస్యలు తెలుసుకోవాలి..

గ్రామాల్లో ప్రజలతో మమేకమవుతూ వారితో మాట్లాడుతూ.. సమస్యలు తెలుసుకోవాలని, ఎక్కువగా భూ తగాదాలు జరగకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా పోలీసు నిఘా ఏర్పాటు చేస్తూ.. ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నేరాల నిర్మూలనకు సంబంధిత పోలీస్‌స్టేషన్ పరిధిలో విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించాలని, ఆకస్మికంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ చలాన్, పెట్టి కేసులు నమోదు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులకు అవగాహన కల్పించాలని ఎస్పీ తెలియజేశారు. చోరీల నిర్మూలనకు ప్రజలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన నూతన చట్టాలపై అధికారులందరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీ ఎన్.లింగయ్య, సీఐలు శివశంకర్, రామ్‌లాల్, చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి, సోమనర్సయ్య, వెంకటేశ్వర్లు, వసంత రామ్‌లాల్, భాగ్యలక్ష్మి రెడ్డి, కుర్మయ, నవీద్, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులు

వానాకాలం పంటల సాగుపై అవగాహన



రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు

మాగనూర్: రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో మంగళవారం మాగనూర్ రైతువేదికలో వానాకాలం పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా వానాకాలంలో వివిధ పంటల సాగు విధానం, చీడపీడల నివారణ, ఎరువుల యాజమాన్యం వంటి అంశాలపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ వారిచే వివిధ యూ ట్యూబ్ వీడియోలను ప్రదర్శించారు. దీంతో పాటు రైతులతో నేరుగా చర్చించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. రైతు భరోసా కార్యక్రమం ద్వారా ఆర్థిక చేయూత అందించే ఉద్దేశంతో రాష్ట్ర స్థాయిలో విధివిధానాలను రూపొందిస్తున్నారు. అందులో భాగంగా ప్రథమంగా నేరుగా క్షేత్రస్థాయిలోని రైతుల అభిప్రాయాలను సేకరించి, ఏ విధంగా రైతు భరోసా కార్యక్రమం కింద ఆర్థిక చేయూతనిస్తే, ఎక్కువ మంది రైతులకు లాభాలు చేకూరుతాయో, ఎన్ని ఎకరాల వరకు లబ్ధి చేకూరుతుందో తదితర అంశాలను క్షేత్రస్థాయిలోని రైతులతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు నాగేష్, మాగనూర్ ఏఓ సుదర్శన్‌గౌడ్, ఉట్కూర్ ఏఓ గణేష్‌రెడ్డి, మిథున్ చక్రవర్తి రైతులు తదితరులు పాల్గొన్నారు.

సెక్యులరిజం, సోషలిజం పేరుతో దేశం విచ్ఛిన్నం

పాలమూరు: దేశంలో 1975లో ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఎన్నిక రాజ్యాంగ బద్ధంగా జరగలేదని, ఈ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చిన క్రమంలో అప్పట్లో జరిగిన ఎమర్జెన్సీ రోజులు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ప్రకాష్‌రెడ్డి అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఎమర్జెన్సీపై ఏర్పాటు చేసిన అవగాగహన సదస్సులో ప్రజాస్వామానికి చీకటి రోజు అనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటికే దేశంలో ఇందిరాగాంధీ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిపోయిందన్నారు. ఈ సమయంలో కోర్టు ఇచ్చిన తీర్పు ఆమె జీర్ణించుకోలేకపోయిందన్నారు. దీంతో దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించిందని, అత్యవసర పరిస్థితులకు వ్యతిరేకించి పోరాటం చేసిన వారందరిని జైలులో బంధించి హింసించడంతోపాటు కఠినంగా శిక్షించడం జరిగిందన్నారు. సెక్యులరిజం, సోషలిజం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేసింది కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. అందుకే రాజ్యాంగంలో అంబేద్కర్ పదాలు పొందుపరచలేదన్నారు.

మత్తు.. చిత్తు!

- నేడు ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం
- మత్తుపదార్థాలపై యువతలో అవగాహన
- సీఎం ఆదేశంతో దిశానిర్దేశంతో రాష్ట్ర యాంటి నార్కోటిక్స్ బ్యూరో ఏర్పాటు
- పేటలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ

మత్తు పదార్థాల రవాణా, సరఫరా వినియోగాన్ని నిర్మూలించి తెలంగాణను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. రాష్ట్ర యాంటి నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో గంజాయి, కల్తీ కల్లు వినియోగంతో జరిగే అనర్థాలపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను సైతం విడుదల చేసింది. బుధవారం మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం(ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం) సందర్భంగా ప్రత్యేక కథనం.

– నారాయణపేట

గంజాయి, కల్తీ కల్లు విక్రయాలకు పాల్పడితే టోల్ ఫ్రీ నంబర్ 8712671111 ఫిర్యాదు చేయాలని పోలీసుశాఖ అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడేవారి సమాచారాన్ని ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెబుతున్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా, మత్తు అనే మహమ్మారి నుంచి కాపాడేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

నేడు ర్యాలీ

మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం(ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం) సందర్భంగా బుధవారం ఉదయం 8 గంటలకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ పేర్కొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ(ఫైల్)

జిల్లాలో గంజాయి పట్టుబడిన కేసుల వివరాలు



సంవత్సరం	కేసులు (ఎక్సైజ్)	కేసులు (పోలీసు)	అరెస్టులు	కిలోలు
2020-21	02	--	02	(34 గంజాయి మొక్కలు)
2021-22	--	03	04	870 గ్రాములు
2022-23	--	--	--	--
2023-24	--	03	04	1.800 గ్రాములు(89 మొక్కలు)

భాగస్వాములు కావాలి

మాదకద్రవ్యాలను అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలి. యువత గంజాయికి బానిసలుగా మారి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. జీవితాలు విచ్ఛిన్నం కావడంతో పాటు తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారు. మత్తు వైపు యువత దూరంగా ఉండాలి. అధికారులు, సిబ్బంది సమన్వయంతో గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలి.

– యోగేష్ గౌతం, ఎస్పీ, నారాయణపేట



మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలను వివరించే

దేశ చరిత్రలో ఎమర్జెన్సీ చీకటి దినం

నారాయణపేట: దేశంలో నాటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీపై మంగళవారం జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అధికారం నిలబెట్టుకునేందుకు నాటి ప్రధాని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ఎమర్జెన్సీ విధించి, విపక్షాలు, పత్రికల నోరు మూయించిందని గుర్తుచేశారు. ఎదురు తిరిగిన వారిని కర్కశంగా జైలుకు పంపిందన్నారు. ఇందిరా గాంధీ రాజ్యాంగాన్ని మార్చి అధికారం నిలుపుకొందన్నారు. అదే సూత్రాన్ని నేడు రాహుల్ గాంధీ జేబులో రాజ్యాంగాన్ని పెట్టుకుని, బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ విష ప్రచారం చేశారన్నారు. ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి వచ్చిన కుర్మన్న, నింగిరెడ్డి, నాగూరావు నామాజీ, కుంటి ఎల్లప్ప, నర్సప్ప, నారాయణ పలువురు మాట్లాడారు. కాంగ్రెస్ అధికార దాహం, దేశ విచ్ఛిన్నతికి చేసిన కుట్రలను నేటితరం, భావితరాలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్, బంగ్లా సుదర్శన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్య గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సత్య రఘుపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్ గౌడ్

క్లుప్తంగా

హత్య కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష

గద్వాల క్రైం: ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులకు మూడు సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కుషా తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేటీదొడ్డి మండలం మల్లాపురంతం డాకు చెందిన బరకంబయ్య నర్సింహులుపై అదే గ్రామానికి చెందిన వడ్డె చిన్నతిమప్ప, వడ్డె పెద్ద తిమ్మప్ప వ్యక్తిగత కారణాల చేత దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఈ క్రమంలో దెబ్బలకు తాళలేక స్పృహ కోల్పోయిన నర్సింహులును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారని పేర్కొన్నారు. దాడి చేసిన వ్యక్తులపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు 24.8.2018లో కేటీదొడ్డి పోలీసులు కేసు నమోదు చేశారని, తాజాగా మంగళవారం జిల్లా కోర్టులో సాక్షుల వాంగ్మూలం అనంతరం జడ్జి నిందితులకు మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకున్న పోలీసుల, కోర్టు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రేవల్లిలో గంజాయి కలకలం



గోపాల్‌పేట: వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలో గంజాయి మొక్కల పెంపకం కలకలం రేపింది. ఎస్‌ఐ తిరుపతిరెడ్డి వివరాల మేరకు.. రేవల్లికి చెందిన ఎద్దుల చింతలయ్య కొన్ని నెలలుగా గంజాయి అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఇంటి ఆవరణలో పెంచుతున్న రెండు గంజాయి మొక్కలతోపాటు ఇంట్లో నిల్వచేసిన 5 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా, గతంలో తాను శ్రీశైలం వెళ్లినప్పుడు గంజాయి విత్తనాలు ఇచ్చారని.. ఇంటి ఆవరణలో పెంచుతూ, గంజాయి అమ్మకాన్ని వృత్తిగా మార్చుకున్నాడని ఎస్‌ఐ తెలిపారు. పూర్తి విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.

క్రీడలకు కేరాఫ్ పాలమూరు

ఇప్పటికే జిల్లాలో పలు కొత్త స్టేడియాలు

- పోతులమడుగులో అధునాతన హంగులు
- రూ.3.65 కోట్లతో ఏర్పాటు
- కొనసాగుతున్న పనులు
- గ్రామీణ క్రీడాకారులకు అందుబాటులోకి రానున్న మరో మినీ స్టేడియం



పోతులమడుగులో నిర్మాణమవుతున్న మినీ స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు జిల్లా క్రీడలకు కేరాఫ్‌గా మారుతోంది. ఇప్పటికే జిల్లాలో పలు కొత్త స్టేడియాలు నిర్మాణమయ్యాయి. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో అన్ని వసతులతో కూడిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ఎంవీఎస్ కళాశాల ప్రాంగణంలో మినీ స్టేడియం, చిన్నచింతకుంట మండలం అల్లీపూర్‌లో మినీ స్టేడియం నిర్మాణమై క్రీడాకారులకు అందుబాటులోకి వచ్చాయి.

మినీ స్టేడియం ఆవరణలో అథ్లెటిక్స్ ట్రాక్

మినీస్టేడియం ఆవరణలో 200మీటర్ల అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ కోర్టులు నిర్మించనున్నారు. పోతులమడుగులో



పనులను పరిశీలిస్తున్న డీవైఎస్‌ఓ శ్రీనివాస్

మినీ స్టేడియం నిర్మాణం పనులను జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారు. పనులు వేగవంతం జరిగేలా సంబంధిత శాఖ అధికారులకు తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

ముగింపు దశలో పనులు..

పోతులమడుగులో నిర్మిస్తున్న మినీ స్టేడియం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులు ముగింపు దశలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు ఈ స్టేడియం అందుబాటులోకి వస్తే మరెన్నో క్రీడా సౌకర్యాలు లభిస్తాయి. క్రీడాకారులకు మెరుగైన క్రీడాశిక్షణ లభిస్తుంది.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

పోతులమడుగులో మినీ స్టేడియం

జిల్లాలోని భూత్పూర్ మండలం పోతులమడుగులో అధునాతనమైన మినీ స్టేడియం పనులు కొనసాగుతున్నాయి. ఈ స్టేడియం పనులు చివరి దశకు చేరి ముమ్మరంగా జరుగుతున్నాయి. గ్రామీణ క్రీడాకారులకు ఈ మినీ స్టేడియం ఒక వరంలా మారనుంది. ఎంతో సువిశాలమైన వాతావరణంలో రూ.3.65 కోట్ల నిధులతో ఈ మినీ స్టేడియం పనులు చురుగ్గా సాగుతున్నాయి. కార్యాలయం బిల్డింగ్, షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ హాల్, టేబుల్ టెన్నిస్ హాల్, స్టోర్‌రూం పనులు చేస్తున్నారు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

- ముగ్గురు నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట: జల్సాలకు అలవాటు పడిన గండీడ్ మండలం చిన్న వార్వల్‌కు చెందిన గడ్డమీది రామకృష్ణ, నంచర్ల శ్రీను, సాలనగర్‌కు చెందిన గజ్జి రమేశ్ డబ్బుల కోసం దొంగతనాలు చేస్తూ పోలీసులకు పట్టుబడగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ వివరాలు వెల్లడించారు. జిల్లాలోని కోస్గి, మద్దూర్ మండలాల్లో పలు దొంగతనాలు జరిగాయి. ఈ నెల 24న సాయంత్రం కోస్గి శివాజీ చౌరస్తాలో పోలీసులు నాకాబందీ నిర్వహించగా ఈ ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించగా ఎస్‌ఐ నరేశ్, సిబ్బంది పట్టుకొని విచారించారు. మద్యం, జల్సాలకు అలవాటుపడి డబ్బుల కోసం చిన్న చిన్న దొంగతనాలు చేస్తున్నట్లు.. కోస్గి, మద్దూర్ మండలాల్లో చేసిన చోరీల గురించి విచారణలో అంగీకరించారు.

నగలు, నగదు స్వాధీనం..

వారి నుంచి 4.7 కిలోల వెండి ఆభరణాలు, 44 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1,50,500 నగదు, నాలుగు బోరుమోటార్లు, 8 సీలింగ్ ఫ్యాన్లు, మూడు వైర్ బిండళ్లు, 9 మేకలు, పొట్టేళ్లు, డెల్ కంపెనీకి చెందిన ఒక మానిటర్, సీపీయూ, 32 ఈంచుల టీవీ, ఒక ప్రింటర్ స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చి జైలుకు తరలించినట్లు ఎస్పీ వివరించారు. 9 కేసులను ఛేదించిన పోలీసులను కోస్గి సీఐ సోమనర్సయ్య, ఎస్‌ఐ బాల వెంకటరమణ, కానిస్టేబుల్ అంజలయ్యను ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు.

27 సెల్‌ఫోన్లు అందజేత..

సెల్‌ఫోన్లు పోగొట్టుకొని జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసిన 27 మంది బాధితులకు మంగళవారం ఎస్పీ యోగేష్ గౌతమ్ రికవరీ చేసిన వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ పోయిన వెంటనే దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌లోగాని, సీఈఐఆర్ వెబ్ పోర్టల్‌లోగాని ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఐటి కోర్ ఎస్‌ఐ సునీత, కానిస్టేబుల్ శ్రీనివాసులును ఎస్పీ అభినందించి రివార్డు అంజేశారు. సమావేశంలో డీఎస్పీ లింగయ్య, సీఐలు, ఎస్‌ఐలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన జూడాల నిరసన సమ్మె



నిరసన తెలుపుతున్న జూనియర్ వైద్యులు

పాలమూరు: జూనియర్ వైద్యులు చేస్తున్న నిరసన సమ్మె మంగళవారం రెండోరోజు జిల్లా జనరల్ ఆస్పత్రి ఆవరణలో కొనసాగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆస్పత్రి ఆవరణలో టెంట్‌లో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. మొత్తం 8 రకాల డిమాండ్స్‌పై జూనియర్ వైద్యులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా నిరసన సమ్మెలో జిల్లా జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ సాయిరాం మాట్లాడుతూ ఆస్పత్రిలో మొత్తం 180 మంది ఉంటే.. ఇందులో 80 మంది నిరసనలో పాల్గొనగా.. మిగిలిన వంద మంది గైనిక్, జనరల్ మెడిసిన్, ఇతర విభాగాల్లో ఓపీ, అత్యవసర సేవల్లో పాల్గొన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించే వరకు నిరసన సమ్మె కొనసాగుతుందని వారు తేల్చిచెప్పారు. కార్యక్రమంలో జూనియర్ వైద్యులు తేజశ్రీ, సహజ, అఖిల్, ప్రణయ్, హేమవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బాలింత మృతిపై వైద్యుల తప్పిదం లేదు



గద్వాల క్రైం: చికిత్స పొందుతూ బాలింత మృతి చెందిన ఘటనపై వైద్యుల తప్పిదం లేదని ఐఎంఏ సభ్యులు గోవర్ధన్, నళిని, మోహన్‌రావు, భాస్కర్‌రెడ్డి, అశ్విని స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అనంత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణానికి చెందిన ఆఫ్రిన్ ఈ నెల 19వ తేదీన ప్రసవం కోసం ఆస్పత్రికి రాగా, హైబీపీ ఉందని అత్యవసర పరిస్థితిలో శస్త్ర చికిత్స చేస్తే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారనే కుటుంబసభ్యులకు వివరించామన్నారు. ఈ క్రమంలో ఆమెకు రెండు దఫాలు మూర్ఛ వచ్చిందన్నారు. రక్తకణాలు తగ్గుముఖం పట్టడంతో మెరుగైన చికిత్స కోసం 20వ తేదీన కర్నూల్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించామన్నారు. అక్కడి వైద్యులు సైతం చికిత్స అందించినప్పటికి ఫలితం లేకపోవడంతో 21వ తేదీన హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో బాలింతకు వైద్య సేవలు అందించారన్నారు. 24న చికిత్స పొందుతూ ఆమె మృతి చెందిందన్నారు. అక్కడి వైద్యులు ఇచ్చిన రిపోర్టులో మెదడులోని రక్త కణాలు చిట్ల పోవడం, కిడ్నీలు పాడైపోవడంతో మృతి చెందినట్లు ఉందన్నారు. వైద్యుల తప్పిదం ఏమాత్రం లేదన్నారు. ఈ క్రమంలో మృతురాలి బంధువులు, కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి ఆస్పత్రికి చేరుకుని నిరసన వ్యక్తం చేస్తూ, ఫర్నీచర్, సిబ్బందిపై దాడులకు పాల్పడ్డారన్నారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం కింద రూ. 27లక్షల ఒప్పందం మేరకు వారు శాంతించారన్నారు. ఇలాంటి పునరావృతం కాకుండా జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు ఎలాంటి వైద్య సేవలు ఇవ్వడం లేదన్నారు. పోస్టుమార్టంలో వచ్చే నివేదికల ఆధారంగా వైద్యుల తప్పిందం తెలితే చట్ట పరమైన చర్యలు ఉంటాయన్నారు.

క్రీడల్లో దేశానికి పేరు ప్రతిష్టలు తేవాలి

- జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్
- పాలమూరులో ఇండియన్ నెట్‌బాల్ మహిళల శిక్షణ ప్రారంభం



నెట్‌బాల్ క్రీడాకారిణులను అభినందిస్తున్న డీవైఎస్‌ఓ శ్రీనివాసులు తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రీడల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ఇండియన్ నెట్‌బాల్ మహిళల 2వ శిక్షణ శిబిరాన్ని మంగళవారం డీవైఎస్‌ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారిణులకు ప్లేయింగ్ కిట్‌లు అందజేసి మాట్లాడారు. జాతీయ స్థాయి నెట్‌బాల్ కోచింగ్ క్యాప్‌లో మహిళలు రాణించాలన్నారు. క్రీడల్లో నిరంతరం సాధనతోనే మెరుగైన విజయాలు సాధిస్తారని చెప్పారు. నెట్‌బాల్ క్రీడలో పట్టుసాధించి రానున్న అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభచాటాలని పిలుపునిచ్చారు. నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖాజాఖాన్ మాట్లాడుతూ సౌదీ అరేబియాలోని రియాద్‌లో అక్టోబర్‌లో జరిగే ఏషియా నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు సంబంధించి ఇండియన్ మహిళా క్రీడాకారిణులకు జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో 20 రోజులపాటు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు విక్రమాదిత్యరెడ్డి, ఉపాధ్యక్షుడు రాంమోహన్, కోశాధికారి సోహైల్ ఉర్ రహెమాన్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళా క్రీడాకారిణులు వీరే..

20 రోజులపాటు జరిగే శిక్షణ శిబిరంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారిణులు పాల్గొంటున్నారు. సోని, పలక్, మహిమా బేనివాల్, మధు, వర్ష (హర్యానా), సోనమ్ శర్మ (చత్తీస్‌ఘడ్), పూజ చోప్రా, లక్ష్మీకన్వార్ (రాజస్థాన్), ఐశ్వర్య పీకే, అశ్వతి పుతలిం కుత్తు (కేరళ), గీతాంజలి బగ్గా, మహి (ఢిల్లీ), ఎరువ యశశ్రీ, అక్షయగిరి, లితిష గౌతి (తెలంగాణ), షరయు ప్రవీణ్ జగ్‌తప్ (గోవా), సురభి బ్రమినిపర రమేష్ (కర్ణాటక) ఉన్నారు.

తాగుడుకు బానిసై వ్యక్తి ఆత్మహత్య

అమరచింత: నిత్యం తాగుడుకు బానిసై ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కిష్టంపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కిష్టంపల్లికి చెందిన వెంకటన్న(45) కొన్ని సంవత్సరాలుగా మద్యం తాగుడుకు బానిసై కుటుంబ పోషణను విస్మరిస్తూ.. తిరిగేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కాలికి గాయమవడం, కాలు వాచి చీము పట్టి తగ్గకపోవడం, తాగేందుకు డబ్బులు లేక ఇబ్బందులకు గురయ్యాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలియజేశారు.

ఎట్టకేలకు పరిహారం

ఎన్‌హెచ్‌–167కే భూనిర్వాసితులకు నష్టపరిహారం మంజూరు



కొల్లాపూర్ సమీపంలో కొనసాగుతున్న జాతీయ రహదారి పనులు

- ఏడాదిన్నర క్రితం భూసేకరణ ప్రక్రియ చేపట్టిన అధికారులు
- పలు కారణాలతో పరిహారం చెల్లింపులో జాప్యం
- మంత్రి జూపల్లి ఉన్నతస్థాయి సమీక్షతో కదలిక
- పది రోజుల నుంచి ప్రారంభమైన పరిహారం చెల్లింపులు
- త్వరలోనే కొల్లాపూర్ బైపాస్ పనులకు శ్రీకారం

కొల్లాపూర్: భారత్‌మాల పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు 167కే జాతీయ రహదారిని మంజూరుచేసింది. రహదారి నిర్మాణంలో భాగంగా కొల్లాపూర్ వద్ద బైపాస్ కోసం ఏడాదిన్నర క్రితం భూసేకరణ ప్రక్రియ చేపట్టారు. భూనిర్వాసితులకు పరిహారం చెల్లింపులో ఆలస్యం కారణంగా ఇన్నాళ్లు పనులు ప్రారంభం కాలేదు. దీనిపై ఇటీవల ఉన్నతస్థాయి సమీక్ష జరగడంతో సంబంధిత అధికారులు పరిహారం చెల్లింపులకు శ్రీకారం చుట్టారు. పది రోజులుగా నష్టపరిహారం డబ్బులను భూనిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నారు.

ముమ్మరంగా సాగుతున్న పనులు..

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొల్లాపూర్ నియోజకవర్గంలోని మల్లేశ్వరం సమీపంలో కృష్ణానదిపై ఐకానిక్ సస్పెన్సివ్ కేబుల్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. మొదటి విడతలో కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు 85 కి.మీ. మేర రహదారి విస్తరణ, బైపాస్, అండర్‌పాస్ నిర్మాణాలు చేపట్టేందుకు 2021 సెప్టెంబర్ 26న టెండర్లు పూర్తిచేశారు. రూ. 436.91 కోట్లకు ఆర్‌కే ఇన్‌ఫ్రా టెండర్ దక్కించుకుంది. గతేడాది జూలైలో కాంట్రాక్టు కంపెనీ పనులను ప్రారంభించింది. కల్వకుర్తి–నాగర్‌కర్నూల్ మధ్య రహదారి విస్తరణ పనులు 80 శాతం మేరకు పూర్తయ్యాయి. నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్ మధ్య కూడా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పలు చోట్ల కల్వర్టుల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పనులకు కొంత అడ్డంకులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కొల్లాపూర్ పట్టణ సమీపంలో జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి.

బైపాస్ నిర్మాణంలో జాప్యం..

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కల్వకుర్తి సమీపంలో, తాడూరు–ఇటిక్యాల మధ్య, కొల్లాపూర్ పట్టణ సమీపంలో బైపాస్ రహదారులు నిర్మించనున్నారు. ఏడాదిన్నర క్రితం అధికారులు భూసేకరణ ప్రక్రియ చేపట్టారు. నాగర్‌కర్నూల్‌లో భూసేకరణకు సమస్యలు తలెత్తగా.. కల్వకుర్తి, కొల్లాపూర్‌లో సాఫీగా సాగింది. భూములు కోల్పోయే వారి జాబితాను పేపర్ నోటిఫికేషన్ ద్వారా అధికారులు రెండుసార్లు ప్రకటించారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో 132 ఎకరాలు, నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 140, కొల్లాపూర్ నియోజకవర్గంలో 89 ఎకరాల మేరకు భూసేకరణ చేపట్టారు. వీటిలో అధిక భాగం భూము లు ప్రభుత్వ పరిధిలోనే ఉన్నాయి. మిగతా వాటికి పరిహారం చెల్లించేందుకు అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. కొల్లాపూర్ సమీపంలోని వరిదేల శివారులో 19.5 ఎకరాలు, చౌటబెట్ల శివారులో 17.5 ఎకరాల భూ మికి పరిహారం చెల్లించాలని నిర్ణయించారు.

ఇటీవల ఉన్నతస్థాయి సమీక్ష..

కొల్లాపూర్ సమీపంలోని వరిదేల, చౌటబెట్ల శివార్లలో నిర్మించే బైపాస్‌లో వ్యవసాయ భూములు, ఇంటి స్థలాలు కోల్పోతున్న వారికి పరిహారం చెల్లించే విషయంలో నేషనల్ హైవే అథారిటీ, జిల్లా రెవెన్యూ అధికారులకు పలు సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వరుసగా నష్టపరిహారం చెల్లింపులకు బడ్జెట్ కేటాయించకపోవడం.. వరుసగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు రావడంతో పరిహారం చెల్లింపులో జాప్యం జరిగింది. ఇటీవల మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి త్వరితగతిన పరిహారం చెల్లించాలని సూచించారు. మంత్రి ఆదేశానుసారం రెండు వారాల క్రితం కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, నేషనల్ హైవే అధికారులు సమీక్ష నిర్వహించి, పరిహారం చెల్లింపుపై ఒక అంగీకారానికి వచ్చారు. పది రోజుల నుంచి లబ్ధిదారులకు పరిహారం డబ్బులు చెల్లిస్తున్నారు.

అనుమానాలకు సెలవు..

కొల్లాపూర్ సమీపంలో నిర్మించనున్న బైపాస్ రహదారి అలైన్‌మెంట్ మారుస్తున్నారంటూ కొంతకాలంగా విస్తృత ప్రచారం సాగుతోంది. దీంతో బైపాస్ రహదారి నిర్మాణం చేపడతారా లేదా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. బైపాస్ నిర్మాణ ప్రాంతాల్లో భూములు కోల్పోతున్న వారికి పరిహారం చెల్లిస్తుండటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక బైపాస్‌కు ఢోకా లేనట్టే అనే నిర్ధారణకు వచ్చారు. త్వరితగతిన బైపాస్ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

జూలైలో పనులు ప్రారంభించే అవకాశం

బైపాస్ నిర్మాణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టు కంపెనీ అన్ని వనరులను సిద్ధం చేసుకుంది. పరిహారం చెల్లింపుల్లో ఆలస్యం కారణంగా ఇన్నాళ్లు పనులు చేపట్టలేదు. చౌటబెట్ల శివారు పరిధిలోని వారికి పరిహారం డబ్బులు చెల్లిస్తుండటంతో, ఆ ప్రాంతంలో మొదట పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జూలైలో పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టు కంపెనీకి చెందిన ప్రతినిధి వెల్లడించారు.

పరిహారం చెల్లింపులు పూర్తిచేస్తున్నాం..



జాతీయ రహదారి నిర్మాణంలో వ్యవసాయ భూములు, ప్లాట్లు కోల్పోతున్న వారందరికీ పరిహారం చెల్లింపులు పూర్తిచేస్తాం. చౌటబెట్ల శివారులోని వారికి మొదట పరిహారం చెల్లింపులు చేస్తున్నాం. మరో 130 మందికి పరిహారం చెల్లించాలి. వరిదేల శివారులోని వారికి ఏకకాలంలో పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాం. పరిహారం చెల్లింపులు జరిగిన ప్రాంతాల్లో రహదారి నిర్మాణ పనులు చేపట్టవచ్చు.

– నాగరాజు, ఆర్డీఓ, కొల్లాపూర్

ఇద్దరు బాలికలకు పాముకాటు

- ఒకరి మృతి.. మరొకరు ఆస్పత్రిలో చేరిక
- ఖిల్లా ఆస్పత్రిలో మందులు, అంబులెన్స్ లేక ఇబ్బందులు
- చికిత్స కోసం ఆర్టీసీ బస్సులో తీసుకెళ్లిన కుటుంబసభ్యులు
- కొత్తపల్లి తండా, ఊరంచు తండాలో చోటుచేసుకున్న ఘటన



ఇందు (ఫైల్)

ఖిల్లాఘనపురం: వేర్వేరు చోట్ల ఇద్దరు బాలికలను పాముకాటు వేయగా.. చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందారు. మరొకరిని చికిత్స నిమిత్తం ఖిల్లా ఆస్పత్రికి తరలించగా.. అక్కడి వైద్య సిబ్బంది పాముకాటు మందులు, అంబులెన్స్ లేవు అని చెప్పడంతో చావుబతుకుల మధ్య బాలికను ఆర్టీసీ బస్సులో మహబూబ్‌నగర్‌కు తరలించారు. ఈ ఘటనలు వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం కొత్తపల్లి తండా, ఊరంచు తండాలో మంగళవారం చోటుచేసుకున్నాయి. ఆయా కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా.. మండలంలోని కొత్తపల్లి తండాకు చెందిన ముడావత్ రవినాయక్ కుటుంబ సభ్యులతో కలిసి రోజులానే ఇంట్లో నిద్రించారు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో కూతురు ఇందు (10)ను ఓ పాము కాటు వేసింది. వెంటనే నిద్రలేచిన ఇందు విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు ఇళ్లంతా వెతకగా కట్లపాము కనిపించింది. దానిని చంపి పాపను చికిత్స నిమిత్తం వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కానీ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలిక మృతిచెందింది. తండ్రి రవినాయక్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

షాపురం ఊరంచు తండాలో..

ఇదిలాఉండగా, మండలంలోని షాపురం ఊరంచు తండాకు చెందిన రెడ్యానాయక్ కూతురు లలిత తిమ్మాజిపేట గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. ఇటీవల తండాకు వచ్చిన లలిత మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి పొలం వద్దకు వెళ్లింది. పొలంలో నడుస్తున్న క్రమంలో ఓ పాము బాలిక లలితను కాటువేసింది. విషయాన్ని తల్లిదండ్రులకు తెలపగా.. కాట్లు గుర్తించి చికిత్స నిమిత్తం ఖిల్లాఘనపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



పాముకాటుకు గురైన లలితను మహబూబ్‌నగర్‌కు ఆర్టీసీ బస్సులో తీసుకెళ్తున్న తల్లి పద్మ

ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం.. బాధితుల ఇబ్బందులు

అయితే, ఖిల్లా ఆస్పత్రిలో పాముకాటుకు మందులు లేవని అక్కడ ఉన్న వైద్య సిబ్బంది చెప్పడంతో బాలిక తల్లి, కుటుంబసభ్యులు అయోమయంలో పడ్డారు. దీనికితోడు అంబులెన్స్ కోసం వెతకగా అది కూడా అందుబాటులో లేదని తెలియడంతో చేసేది లేక తల్లి పద్మ కూతురుని ఆర్టీసీ బస్సులో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో బాలిక చికిత్స పొందుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదిలాఉండగా, ఖిల్లాఘనపురం సీఎస్‌సీ డాక్టర్ పుల్లారెడ్డిని వివరణ కోరగా.. ఆస్పత్రిలో పాముకాటుకు మందులు ఉన్నాయని చెప్పడం గమనార్హం. మందు ఉండి కూడా అత్యవసర సమయంలో బాలికకు వైద్యం అందించకపోవడం.. ఒక వేళ ప్రాణాల మీదికి వచ్చింటే ఏంటి పరిస్థితి అని పలువురు వైద్య సిబ్బంది తీరును ప్రశ్నిస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్ స్థాపించండి. ప్లాస్టిక్ ఉద్యోగ్‌తో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్డ్) 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-5787]

WANTED

■ నర్మద హోండా షోరూం మహబూబ్‌నగర్, వనపర్తిలో పని చేయుటకు, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ మేనేజర్, ఫ్లోర్ సూపర్ వైజర్, స్పేర్ పార్ట్స్ ఇంచార్జ్, మెకానిక్‌లు కావలెను. సంప్రదించండి: మహబూబ్‌నగర్: 9493159185 వనపర్తి: 9440435060. [J-492]

■ మహబూబ్‌నగర్ జిల్లాలో స్టార్ ఇండియా ఫైనాన్స్ & హోమ్‌లోన్స్‌లో పనిచేయడానికి మార్కెటింగ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం 10,000/- నుండి 20,000/- + ఇన్సెంటివ్. సెల్: 7888855009 [J-720244]

■ కొత్తగా ప్రారంభించిన మా కంపెనీలో జాబ్ చేయుటకు 49 స్త్రీ/పురు కావలెను. జీతం: 14వేలు+DA 6వేలు-ఫ్రీ రూం, భోజనం. Q: 10th-డిగ్రీ, ITI, డిప్లొమా(P/F), మహబూబ్‌నగర్. సెల్ 88880 65411. [L-792249]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధుల ను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి/భోజనం జీతం : 18K ఫోన్: 9160900024 / 9840400073 [H-799897]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్

ప్రజల గొంతును గుర్తించండి

స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేఖ

ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించేందుకు వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలి

సాక్షి, అమరావతి: ప్రజా సమస్యలను చట్టసభల్లో బలంగా వినిపించేందుకు ప్రతిపక్ష హోదా ఉండాల్సిందేనని, ఈ విషయంలో పరిశీలన చేయాలని కోరుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం లేఖ రాశారు. ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుందన్నారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10 శాతం సీట్లు సాధించాలని చట్టంలో ఎక్కడా లేదన్నారు. విపక్ష పార్టీల్లో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారని పేర్కొన్నారు. శాసనసభలో కూటమి పార్టీల ఉద్దేశపూర్వక చర్యలను సైతం లేఖలో ప్రస్తావించారు. వైఎస్ జగన్ లేఖలో ముఖ్యాంశాలు ఇవీ..

శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నారు..

మంత్రుల తర్వాత నాతో ప్రమాణం చేయించడం సంప్రదాయాలకు పూర్తి విరుద్ధం. ప్రధాన ప్రతిపక్ష నాయకుడి గుర్తింపు ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయించినట్లు దీనిద్వారా కనిపిస్తోంది. విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే పది శాతం సీట్లు సాధించి ఉండాలని చట్టంలో ఎక్కడా లేదు. పార్లమెంట్‌లోగానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోగానీ ఈ నిబంధన పాటించలేదు. అధికార కూటమి, స్పీకర్ ఇప్పటికే నాపట్ల శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. చచ్చేదాకా కొట్టాలంటూ స్పీకర్ చేసిన వ్యాఖ్యలు వీడియోల ద్వారా బయటపడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో అసెంబ్లీలో గొంతు విప్పే అవకాశాలు కనిపించడం లేదు. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతోనే ప్రజా సమస్యలను బలంగా వినిపించే ఆస్కారం ఉంటుంది. ప్రతిపక్ష పార్టీగా గుర్తింపుతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుంది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని నా లేఖను పరిశీలించాలని కోరుతున్నా.

అంతరంగం అప్పుడే అర్థమైంది..

ఈనెల 21న అసెంబ్లీలో జరిగిన ఎమ్మెల్యేల ప్రమాణం కార్యక్రమాన్ని పరిశీలిస్తే నాకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వరనే అభిప్రాయం కలిగింది. అసెంబ్లీ సంప్రదాయాల ప్రకారం ముందుగా సభా నాయకుడు, తర్వాత ప్రతిపక్ష నాయకుడు, అనంతరం మంత్రులు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉండగా అలా జరగలేదు. సంప్రదాయాలకు విరుద్ధంగా మంత్రుల తర్వాతే నాతో ప్రమాణం చేయించారు. నాకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకూడదనే నిర్ణయాన్ని మీరు ముందుగానే తీసుకున్నట్లు కనిపిస్తోంది.

చట్టంలో స్పష్టంగా ఉంది..

ప్రధాన ప్రతిపక్ష పార్టీ, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అంటే ఎవరనే విషయాన్ని చట్టంలో స్పష్టంగా పొందుపరిచారు. 'ఆంధ్రప్రదేశ్ పేమెంట్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్క్వాలిఫికేషన్ యాక్ట్ 1953 చట్టం 12 ఆ' ప్రధాన ప్రతిపక్ష పార్టీ అంటే ఎవరనే విషయాన్ని స్పష్టంగా నిర్వచించింది. విపక్షంలో ఉన్న పార్టీల్లో ఎవరికి ఎక్కువ సంఖ్యా బలం ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టం చెబుతుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికలకు ముందే పొత్తు పెట్టుకుని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినందున విపక్షంలో ఉన్న ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే. కానీ జూన్ 21న జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని చూస్తే వైఎస్సార్‌సీపీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం, పార్టీ శాసనసభా పక్ష నాయకుడిగా నన్ను ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించడంలో మీ ఉద్దేశాలేమిటో బయటపడ్డాయి. కానీ చట్టాన్ని పరిశీలిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడంలోగానీ, పార్టీ శాసనసభా పక్షనేత అయిన నన్ను ప్రధాన ప్రతిపక్ష నేతగా స్పీకర్ గుర్తించేందుకుగానీ ఎలాంటి సందిగ్ధతకు తావులేదు. ఇటీవల స్పీకర్ చేసిన వ్యాఖ్యలు యూట్యూబ్ ఛానళ్లలో ఉన్నాయి. ఓడిపోయాడుగానీ చావలేదు.. చచ్చేవరకూ కొట్టాలి..! అంటూ నన్ను ఉద్దేశించి గౌరవ స్పీకర్ అన్న మాటలు ఆ వీడియోల్లో ఉన్నాయి. తద్వారా నాపై ఉన్న శత్రుత్వాన్ని స్పీకర్ రూపంలో అధికార కూటమి వ్యక్తం చేసింది.

వైఎస్సార్ సీపీ 40 శాతం ఓట్లను సాధించింది..

ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 40 శాతం ఓట్లను సాధించింది. ప్రజా సంబంధిత అంశాలపై అసెంబ్లీలో ప్రజల తరఫున ప్రాతినిధ్యం వహించాల్సిన బాధ్యత మాపై ఉంది. అయితే ప్రభుత్వం, స్పీకర్ శత్రుత్వ వైఖరిని ప్రదర్శిస్తున్న నేపథ్యంలో మా పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకుంటే అసెంబ్లీ కార్యకలాపాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని కట్టడి చేస్తున్నట్లే అవుతుంది. వైఎస్సార్ సీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడం వల్ల అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడికి తగిన సమయం లభిస్తుంది. దీనివల్ల ప్రజా సంబంధిత అంశాలను సభ దృష్టికి బలంగా తేగలుగుతారు. సభా కార్యక్రమాల్లో ముమ్మరంగా పాల్గొనేలా, ప్రభుత్వ విధానాలపై ప్రతిపక్ష పార్టీగా అభిప్రాయాలను చెప్పేలా చట్టబద్ధమైన భాగస్వామ్యం ప్రధాన ప్రతిపక్ష పార్టీకి లభిస్తుంది. ఇలాంటి పరిస్థితి లేకపోతే అసెంబ్లీలో అధికార కూటమి గొంతు మాత్రమే వినిపిస్తుంది. వివిధ అంశాల్లో బలమైన చర్చలు జరిగే అవకాశం కనిపించదు.

అసెంబ్లీలో 10 శాతం సీట్లు రానందున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసన సభా పక్షానికి ప్రధాన ప్రతిపక్ష హోదా లభించదనే చర్చ జరుగుతోంది. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 208 కింద ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ నోటిఫై చేసిన సభా ప్రవర్తనా నియమావళిలో నిర్దిష్ట సీట్లు వస్తేనే ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించాలనే విషయాన్ని ఎక్కడా చెప్పలేదనే విషయాన్ని మీ ముందుకు తెస్తున్నా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎక్కడా ఈ నిబంధన పాటించలేదనే అంశాన్ని గుర్తు చేస్తున్నా. లోక్‌సభకు 1984లో 543 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ 30 ఎంపీ సీట్లను గెలుచుకుంది. సభలో 10 శాతం సీట్లు సాధించనప్పటికీ నాడు టీడీపీకి చెందిన పర్వతనేని ఉపేంద్రను ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించారు. 1994 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 294 సీట్లకుగానూ కాంగ్రెస్ 26 సీట్లు మాత్రమే సాధించింది. 10 శాతం సీట్లు కాంగ్రెస్‌కు దక్కనప్పటికీ పి.జనార్దన్‌రెడ్డిని నాడు ప్రధాన ప్రతిపక్ష నేతగా గుర్తించారు.

ఉపేంద్ర, పీజేఆర్‌ను ప్రధాన ప్రతిపక్ష నేతలుగా గుర్తించారు..

2015 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకుగానూ బీజేపీ కేవలం 3 సీట్లు సాధించినప్పటికీ ఆ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చారు. ఈ అంశాలన్నీ కూడా కేవలం ప్రజా ప్రయోజనాల రీత్యా మీ దృష్టికి తెస్తున్నా. ప్రజల తరఫున అసెంబ్లీలో గొంతు విప్పడానికి తగిన సమయం లభించాలనే ఉద్దేశంతో మీకు ఈ లేఖ రాస్తున్నా. అయితే ఇలాంటి పరిస్థితికి ఆస్కారం లేకుండా అధికార కూటమి ఇప్పటికే శత్రుత్వాన్ని ప్రదర్శిస్తోంది. ఈ నేపథ్యంలో నేను సభలో మాట్లాడాలనుకుంటే అది భారీ మెజార్టీ సాధించిన అధికార కూటమి దయమీద, నన్ను చచ్చేవరకూ కొట్టాలన్న స్పీకర్ గారి విచక్షణ మీదే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం సభలో ఉన్న పార్టీల సంఖ్యా బలాలను దృష్టిలో ఉంచుకుని ఈ లేఖను పరిశీలించాలని కోరుతున్నా.

3 సీట్లు వచ్చిన బీజేపీకి సైతం..

ఏపీలో ఆ చానళ్ల ప్రసారాలు వెంటనే పునరుద్ధరించండి

'సాక్షి' సహా పలు చానళ్ల ప్రసారాలు నిలిపివేతపై కేబుల్ ఆపరేటర్లకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో నిలిపివేసిన చానళ్ల ప్రసారాలను తక్షణమే పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. జూన్ 6 నుంచి ఏపీలో సాక్షి, టీవీ9, ఎన్‌టీవీ, 10టీవీ ప్రసారాలను నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ మిని పుష్కర్ణ మంగళవారం విచారించారు. ఆయా చానళ్లను పునరుద్ధరించాలని కేబుల్ ఆపరేటర్లను ఆదేశించారు. లిఖితపూర్వక ఆదేశాలు ఇంకా వెబ్‌సైట్‌లో పొందుపరచాల్సి ఉంది. ఢిల్లీ హైకోర్టు నిర్ణయంపై న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ ఫెడరేషన్ (ఎన్‌బీఎఫ్) హర్షం వ్యక్తం చేసింది. ఏపీలో ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా తీసుకొన్న నిర్ణయంపై కొరడా లాంటి ఆదేశాలుగా అభివర్ణించింది. 'ప్రజాస్వామ్య పనితీరుకు అవసరమైన బహిరంగ, పారదర్శక మీడియా వాతావరణాన్ని నిర్వహించే ప్రాముఖ్యతను హైకోర్టు జోక్యం నొక్కి చెబుతోంది. ఈ తీర్పు పత్రికా స్వేచ్ఛను సమర్థించడం, జర్నలిస్టుల హక్కులను పరిరక్షించడంపై ఓ ఉదాహరణగా నిలుస్తుంది' అని మంగళవారం ఎన్‌బీఎఫ్ ఓ ప్రకటనలో తెలిపింది.

రైతు భరోసాకు పదెకరాలు పరిమితి పెట్టండి

▶ మొదటి పేజీ తరువాయి

బ్యాంకులకు ఆదాయ పన్ను స్టేట్‌మెంట్లు చూపించాల్సి వస్తుందని.. కాబట్టి ఆదాయ పన్ను చెల్లించేవారికి కూడా రైతుభరోసా ఇవ్వాలని సూచించారు. ప్రతీ వారం నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు 'రైతు భరోసా'పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములు వంటి వాటికి రైతు భరోసాను నిలిపివేయాలని కోరారు.

దొడ్డు రకాల వరికీ బోనస్ ఇవ్వాలి

సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో.. చాలా మంది రైతులు దొడ్డు రకం వరికి కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో దొడ్డు వరి సాగు చేసేవారే ఎక్కువని, వారికీ బోనస్ ఇస్తేనే గిట్టుబాటు ధర లభిస్తుందని పేర్కొన్నారు. సన్న రకాలకు ఎటూ డిమాండ్ ఉంటుందని.. మార్కెట్లోనూ మద్దతు ధర కంటే ఎక్కువగా రేటు పలుకుతుందని వివరించారు. ఇక సీజన్ సమయంలో పంటల సాగుకు అవసరమైన కూలీల కొరత ఉంటుందని.. దొరికినా ఖర్చు ఎక్కువ అవుతుందని అనేక మంది రైతులు వాపోయారు. అందువల్ల వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు ఐదేళ్లుగా వ్యవసాయ యంత్రాల సరఫరా నిలిచిపోయిందని, దాంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

రైతుబంధుతో రూ.25,670 కోట్లు వృథా: మంత్రి తుమ్మల

గతంలో సాగులో లేని భూములకు కూడా రైతుబంధు వర్తింపజేసి.. 12 విడతల్లో దాదాపు రూ.25,670 కోట్ల ప్రజాధనం వృథా చేశారని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆరోపించారు. 93 శాతం వాటా ఉన్న సన్న, చిన్నకారు రైతుల వాటా రైతుబంధు మొత్తంలో 68 శాతం కూడా లేదని.. దానికితోడు 17.5 శాతం ఉన్న కౌలు రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం రైతుబంధు స్థానంలో రైతుభరోసా పథకాన్ని తీసుకొస్తోందని, పెట్టుబడి సాయాన్ని ఎకరానికి రూ.15 వేలకు పెంచుతున్నామని చెప్పారు. అయితే రైతుబంధు తరహాలో ప్రజా ధనం వృథా కాకుండా ఉండేలా పటిష్ట విధానాల రూపకల్పనకు తమ ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. రైతునేస్తం కార్యక్రమంలో రైతులు వెల్లడించిన, రాత పూర్వకంగా సేకరించిన సూచనలను క్రోడీకరించి నివేదిక తయారు చేయాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపిని మంత్రి ఆదేశించారు. తమ ప్రభుత్వం రైతుభరోసాకు సంబంధించి ఎటువంటి విధానపరమైన నిర్ణయాలు ఇంకా తీసుకోలేదని.. పూర్తిగా అందరి అభిప్రాయాలు తీసుకున్నాక, శాసనసభలో చర్చించాక పథకాన్ని తీసుకొస్తామని చెప్పారు. ఆలస్యమైనప్పటికీ అర్హులకు మాత్రమే అందేలా రైతుభరోసాకు రూపకల్పన చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రైతుసంఘం నాయకుడు అన్వేశ్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసాపై రైతులతో మాట్లాడండి

రాష్ట్రవ్యాప్తంగా అభిప్రాయ సేకరణ జరపండి: డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రైతు భరోసా పథకాన్ని ఎలా అమలు చేయాలో రైతుల్నే అడిగి తెలుసుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యవసాయ అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల నుంచి అభిప్రాయ సేకరణ జరపాలని ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల అధికారులతో బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ 'రైతు భరోసా'పై రైతుల అభిప్రాయం ఎలా ఉంది? ఈ పథకం అమల్లో ఎలా ముందుకెళ్లాలో వారిని అడిగి తెలుసుకుంటేనే మంచిదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించి మంత్రులు కూడా హాజరయ్యేలా చూడాలని సూచించారు. అసలు తెలంగాణ ఏర్పాటు కాకముందు రైతుల కోసం అమల్లో ఉన్న పథకాలేంటి? గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన పథకాలేంటి? అందుకు గల కారణాలేంటి? తదితర వివరాలను కూడా అందజేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి తగిన బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. సమావేశంలో భాగంగా రాష్ట్రంలో అమల్లో ఉన్న నేతన్న చేయూత, నేతన్న బీమా పథకాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా గురించి చర్చించారు. రాష్ట్ర విభజన తర్వాత చేనేత కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పులు వచ్చాయో నివేదిక ఇవ్వాలని డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ మ్యాచింగ్‌తో అమలయ్యే పథకాలకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తా నియా తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల కాలం

- ఓవైపు పంటల సాగు.. మరోవైపు పిల్లల చదువు ఖర్చులు
- మధ్య తరగతి కుటుంబాలకు ముచ్చెమటలు పట్టిస్తున్న జూన్ మాసం
- వ్యయప్రయాసలు పడుతున్న రైతన్నలు
- అప్పుల కోసం ప్రైవేటు వ్యాపారుల వద్దకు పరుగులు



కల్వకుర్తి టౌన్: వానాకాలం ప్రారంభంతో పంటల సాగులో రైతులు నిమగ్నమయ్యారు. ఆరుద్ర కార్తెలో విత్తనాలు విత్తేందుకు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. పంటసాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలల బాట పట్టారు. అటు వ్యవసాయ పనులు, ఇటు వారి పిల్లల చదువుల పెట్టుబడులు అందరికీ పెనుభారంగా మారాయి. దీంతో ప్రతి ఏడాది జూన్ ప్రారంభం అయ్యిందంటే సామాన్యుల ప్రజలతో పాటు రైతన్నలు భయపడే పరిస్థితి ఏర్పడింది. వేసవితాపం నుంచి వాతావరణం చల్లబడుతుండగా.. సామాన్యులకు మాత్రం జూన్ మాసం ముచ్చెమటలు పట్టిస్తోంది. దిగువ, మధ్య తరగతి వ్యవసాయ కుటుంబాల ప్రజానీకం ఖర్చులకు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

అన్నదాతకు అగమ్యగోచరమే..

వానాకాలం వచ్చిందంటే పంటలకు పెట్టుబడి కాలంగా చెప్పాలి. వ్యవసాయ భూములను చదును చేసి, దుక్కిదున్ని, విత్తనాలు, ఎరువులకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే వ్యవసాయ దుక్కులు, విత్తనాల కొనుగోలు వంటి పనులను ప్రారంభించారు. ఒక్కో ఎకరాకు సుమారు రూ. 30వేల పెట్టుబడి అవసరమవుతుందని రైతులు చెబుతున్నారు. ఇలా సన్నకారు రైతుకు 3 ఎకరాల పొలాన్ని సాగుచేయాలంటే సుమారు రూ.లక్ష పెట్టుబడి అవసరం అవుతుంది. ప్రభుత్వం రైతు భరోసా కింద అందించాల్సిన పెట్టుబడి సాయం సకాలంలో చేతికందక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకులో రుణాలు సైతం సకాలంలో అందించక పోవడంతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. పిల్లల చదువులు, వ్యవసాయానికి పెట్టుబడుల కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

భారమైన బడి ఫీజులు..

గ్రామీణ ప్రాంత విద్యార్థులు చాలా మంది చదువుల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్తారు. పట్టణాలలోని ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు కాస్త ఎక్కువగానే ఉన్నాయి. ప్రీ ప్రైమరీ తరగతులకు రూ. 30వేలు, ప్రైమరీ తరగతులకు రూ. 40వేలు, హైస్కూల్ తరగతులకు రూ. 50వేలకు పైగా ఫీజులు ఉన్నాయి. ప్రతి ఏటా ఆయా పాఠశాలలు వారి వెసులుబాటు మేరకు 10–20 శాతం ఫీజులను పెంచుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులపై పెనుభారం పడుతోంది. ఫీజులకు తోడు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాం, బ్యాగులు, స్టడీ మెటీరియల్ ఇతర ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. చిరు వ్యాపారాలు చేసుకునే వారు, ప్రైవేటు ఉద్యోగాలు చేసేవారు ప్రైవేటు పాఠశాలల ఫీజుల భారాన్ని మోయలేక అవస్థలు పడుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఫీజుల భారాన్ని భరించలేక, ప్రైవేటు పాఠశాలలకు పంపించడం మానేస్తున్నారు. మధ్యతరగతి కుటుంబాలపై ఫీజల భారం ఎక్కువై చాలా ఇబ్బందులు పడుతున్నారు.

వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు ఎకరాకు (సుమారుగా)..

- పొలంలో దుక్కులు, చదును కోసం రూ. 6వేల నుంచి రూ. 8వేలు
- విత్తనాలు (పత్తి) రూ. 2వేలు
- కూలీల ఖర్చు రూ. 3వేలు
- ఎరువులు రూ. 5వేలు
- పురుగుల మందులు రూ. 15వేల నుంచి రూ. 20వేలు
- పత్తి తీయడానికి రూ.4వేలు
- వరిచేను ఖర్చు రూ. 40వేలు
- మొక్కజొన్న చేను ఖర్చు రూ. 35వేలు

ప్రైవేటులో ఒక్కో విద్యార్థికి అయ్యే ఖర్చు (సుమారుగా)

- అడ్మిషన్ ఫీజు రూ. 4వేల నుంచి రూ. 6వేలు
- స్కూల్, ట్యూషన్ ఫీజు (తరగతిని బట్టి) రూ. 10వేల నుంచి రూ. 50వేలు
- పుస్తకాలు (తరగతిని బట్టి) రూ. 4వేల నుంచి రూ. 10వేలు
- రెండు జతల యూనిఫాం రూ. 2వేల నుంచి రూ. 4వేలు
- బస్సు రవాణా కోసం రూ. 15వేల నుంచి రూ. 20వేలు
- ఇకవేళ హాస్టల్ వసతి ఉంటే రూ. 40వేల నుంచి రూ. 60వేలు

పెట్టుబడులకు కష్టంగా మారింది..



రెండున్నర ఎకరాల్లో విత్తనాలు విత్తేందుకు దుక్కులు దున్ని సిద్ధంచేసి పెట్టాను. దుక్కులు దున్నేందుకు, విత్తనాల కొనుగోలుకే సగానికి పైగా పెట్టుబడి డబ్బులు అయిపోయాయి. కలుపు తీసేందుకు, ఇతరత్రా కూలీల ఖర్చుల కోసం మరిన్ని పెట్టుబడులకు కష్టంగా మారింది.

– జంగయ్య, రైతు, చొక్కన్నపల్లి

ఖర్చులు పెరుగుతున్నాయి..



వానాకాలం ప్రారంభం కావడంతో వ్యవసాయానికి పెట్టుబడులతో పాటు పిల్లల చదువు ఖర్చులు భారీగా పెరిగాయి. ఈ ఏడాది పంట పెట్టుబడి పెట్టలేక.. పిల్లల ఫీజులు కట్టలేక అవస్థలు పడుతున్నా. ప్రైవేటు పాఠశాలల్లో పిల్లల ఫీజు ముందే కట్టాలని ఒత్తిడి చేస్తుండటంతో కొంత ఇబ్బందిగా మారింది.

– జంగయ్య, విద్యార్థి తండ్రి, భైరాపూర్

ఐఎన్ఐఎస్ఎస్ ర్యాంకర్‌ను సన్మానించిన ఆర్టీసీ ఆర్ఎం



మౌనికను సన్మానించిన ఆర్ఎం తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మెడిసిన్ స్పెషలైజ్ పీజీ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ సూపర్ స్పెషాలిటీ) ఎంట్రన్స్ టెస్ట్‌లో ఆలిండియా లెవల్‌లో రెండో ర్యాంక్ సాధించిన ఉమ్మడి జిల్లాలోని షాద్‌నగర్ డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్న మహాలింగం కుమార్తె పి.మౌనికను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్ఎం కార్యాలయంలో రీజినల్ మేనేజర్ శ్రీదేవి ఘనంగా సన్మానం చేశారు. ఆర్టీసీ కండక్టర్ కుమార్తె ఈ ఘనత సాధించడం సంస్థకే గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు శ్యామల, లక్ష్మీదుర్గ, డిపో మేనేజర్లు ఉష, సుజాత, పీఓ శ్రీనివాస్‌రెడ్డి, అకౌంట్ అధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కుటుంబాలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న టీఎస్ పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు

టీఎస్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

దామరగిద్ద: ఉపాధ్యాయ కుటుంబాలకు సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందని టీఎస్ పీఆర్టీయూ రాష్ట్రశాఖ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ప్రధానకార్యదరి బీరెల్లి కమలాకర్‌రావు అన్నారు. మండలంలోని గత్ప గ్రామానికి చెందిన ఐఈఆర్‌పీ ఉపాధ్యాయుడు వెంకట్రాములు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందాడు. మంగళవారం బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించి రాష్ట్రశాఖ తరఫున రూ.1.20 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసిన వెంకట్రాములు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. విద్యాశాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి భద్రతకు పీఆర్టీయూ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం ఐఈఆర్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రధానకార్యదర్శి యాద్గిర్ జనార్దన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పేట మండల అధ్యక్షుడు రఘువీర్, దామరగిద్ద మండల అధ్యక్షుడు సత్యనారాయరెడ్డి, ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్లలోనే హాఫిజా కోర్సు చేసిన చిన్నారి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం షాసాబ్ గుట్టకు చెందిన మహ్మద్ హైదర్‌అలీ మనుమరాలు సయ్యదా షారిష్ ముబీన్ పవిత్ర ఖురాన్‌ను కంఠస్థం చేసి హాఫిజా కోర్సు పూర్తి చేశారు. తల్లి జరీష్ తబస్సుం కూడా హాఫిజా ఆలిమా కోర్సు చేయడంతో కూతురిని కూడా ఈ కోర్సు చేయడానికి ప్రోత్సహించారు. దీంతో చిన్నారి ముబీన్ నాలుగున్నరేళ్లలో పవిత్ర ఖురాన్‌ను కంఠస్థం చేసి ప్రారంభించి తన 6 ఏళ్ల వయస్సులో హాఫిజా కోర్సు పూర్తి చేయడం విశేషం.

ఘనంగా సన్మానం

హాఫిజా కోర్సు పూర్తి చేసిన చిన్నారి సయ్యదా షారిష్ ముబీన్‌ను రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఘనంగా సన్మానం చేశారు. శాలువాలతో సత్కరించారు. చిన్నవయస్సులో ఖురాన్‌ను కంఠస్థం చేసి హాఫిజా అవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో హాఫీజ్ సలీం, హైదర్‌అలీ, అజ్మత్‌అలీ, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారి షారిష్ ముబీన్‌ను సన్మానిస్తున్న చైర్మన్ కొత్వాల్

ఉత్సాహంగా సంకీర్తన వారోత్సవాలు



సంకీర్తనా కచేరీ నిర్వహిస్తున్న గద్వాల చంద్రశేఖరరావు

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీఅన్నమయ్యవాణి లలితా సంగీత విద్యాలయం వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గాయకులు గద్వాల చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వచ్చే నెల 1వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీవనమాలి పాదపద కవితా తాత సంకీర్తనా చతుర్థ వారోత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభం కార్యక్రమానికి అన్నమాచార్యుల 12వ తరం వారసులు తాళ్లపాక హరినారాయణచార్యులు, సామవేదం వెంకట మురళీ కృష్ణ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంకీర్తనా వారోత్సవాలు గొప్పగా నిర్వహిస్తుండడం అభినందనీయం అన్నారు. అనంతరం గద్వాల చంద్రశేఖరరావు నిర్వహించిన అన్నమయ్య సంకీర్తన కచేరీ అలరించింది. ప్రతిరోజు సాయంత్రం 5.30 నుంచి 9.30 గంటల వరకు సంకీర్తనా కచేరీ ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్‌లో 14 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం రోజురోజుకూ పెరుగుతోంది. గత నెలలో 10 అడుగులు ఉన్న నీటిమట్టం పది రోజులుగా క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వరకు ప్రాజెక్టు నీటిమట్టం 14 అడుగులకు చేరుకుంది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ జూరాల నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని కోయిల్‌సాగర్‌కు వదులుతున్నారు. దీంతో ఉంద్యాల ఫేస్–1 వద్ద ఒక మోటారు రన్ చేసి నీటిని పంపింగ్ చేస్తుండగా అక్కడి నుంచి తీలేర్ వద్దకు నీరు చేరుకుంటుంది. తీలేరు ఫేస్–2 నుంచి ఒక పంపు రన్ చేసి కోయిల్ సాగర్‌కు నీటిని అందిస్తున్నారు. రోజురోజుకూ కొద్ది మేర నీటిమట్టం పెరగడం వల్ల ప్రాజెక్టు జల కళ సంతరించుకుంటుంది. ప్రాజెక్టు పాత అలుగు స్థాయి 26.6 అడుగులు కాగా.. గేట్ల స్థాయి వరకు 32.6 అడుగులు. ప్రస్తుతం ఉన్న నీటిమట్టానికి మరో 12.6 అడుగుల నీరు చేరితే పాత అలుగుకు వస్తుంది. నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరితేనే వానాకాలం సాగుకు నీటిని వదిలే అవకాశం ఉంది.